

# పుస్తక పరిచయం




**సినీ సంగీతానికి స్వర్ణయుగం అనదగిన దశాబ్దాలు** 1980 మధ్యవరకూ కొనసాగాయి. సాహిత్యానికి పెద్దపీట వేసిన దర్శక, నిర్మాతలు- దాన్ని అర్థం చేసుకుని మాటల్ని మింగేయని సంగీతాన్ని అందించిన సంగీత దర్శకులు, పాటలోని భావాన్ని అర్థం చేసుకుని, జీర్ణించుకుని అనుభూతించి పాటలు పాడిన గాయనీ గాయకులు..అన్నీ కలిసి ప్రతి పాటనీ మరపురాని పాటగా చేసిన ఆ యుగం..నిజంగా స్వర్ణయుగం. ప్రస్తుతం వస్తున్న పాటలు..- సంవత్సరాలు వదిలెయ్యండి - కనీసం ఎన్ని రోజులు ప్రేక్షకుల మనసుల్లో నిలుస్తున్నాయన్న ప్రశ్నకి సమాధానం చెప్పడం పెద్ద కష్టమేం కాదు ఈ రోజుకీ 50 - 60 సంవత్సరాల క్రిందటి సినిమాలు విడుదలైన కాలంలో ఇంకా కళ్ళు తెరవని, ఈ నాటి యువతరంలో అధికశాతం మంది ఆ నాటి పాటలనే అభిమానిస్తున్నారంటే ఆ పాటల శాశ్వతత్వాన్ని అర్థం చేసుకోవచ్చు. అలాంటి శాశ్వతత్వం కలిగిన పాటలని స్వరపరచిన సంగీతదర్శకులు ఒకరా ఇద్దరా..ఎంతోమంది మహానుభావులు. వారిలో దాదాపు అందరూ శాస్త్రీయ సంగీతంలో నిష్ణాతులే. ఆయా సంగీతదర్శకుల జీవన చిత్రాలు ఎలాంటివి? ఎన్ని అవరోధాలని, ఆటంకాల్ని ఎదుర్కొని అవకాశాలు సంపాదించుకున్నారు, సంపాదించుకున్న అవకాశాలని నిలబెట్టుకోడానికి ఎంత కృషిచేశారు..ఇలాంటి విశేషాలన్నీ తెలుసుకోవడం కేవలం ఆసక్తికరమే కాదు..ఎన్నో నేర్చుకోవాల్సిన పాఠాలు కూడా కనిపిస్తాయి. వాళ్ళ జీవన గాథలని సమగ్రంగా ఆవిష్కరించిన బృహత్తర ప్రణాళిక ఈ గ్రంథం. అప్పుడప్పుడూ అక్కడక్కడా వచ్చిన వ్యాసాల సంకలనం లాగా కాకుండా రచయిత పులగం చిన్నారాయణగారు ఈ పుస్తకంలోని విశేషాలన్నింటినీ స్వయంగా సేకరించారు. దాదాపు రెండేళ్ళపాటు ఎంతో శ్రమించి అలనాటి సంగీతదర్శకుల వారసుల్ని కలుసుకుని సమాచారాన్ని ప్రోదిచేశారు. సేకరించిన సమాచారాన్ని సరళమైన భాషలో, ఉత్సుకత కలిగించే శైలిలో తీర్చిదిద్దారు. కేవలం జీవితగాథలే కాక ఆయా దర్శకుల చిత్రావళి, చాలా సందర్భాల్లో గణాంకాలూ, విశ్లేషణలూ ఇవ్వడం రచయిత కృషిలోని నిజాయితీని, నిబద్ధతనీ చూపిస్తుంది. ఎన్నో అరుదైన, విలువైన చిత్రాలు ఈ పుస్తకానికి అదనపు ఆకర్షణ. ఇంత ప్రత్యేకమైన పుస్తకాన్ని రూపొందించడం వెనుకనున్న శక్తి, సినిమారంగంతో ఏమాత్రం సంబంధం లేని వ్యక్తి కావడం ఒక విశేషం. **www.chimatamusic.com** అనే వెబ్ సైట్ ద్వారా అలనాటి సినీ స్వర్ణయుగపు పాటలని అంతర్జాతీయంగా వున్న తెలుగువారికి అందిస్తున్న శ్రీ చిమట శ్రీనివాసరావు కృషి ఫలితం ఈ అరుదైన గ్రంథం. చిన్న ఆలోచనగా మొదలైన ప్రణాళికని అందమైన గ్రంథంగా తీర్చి దిద్దేవరకూ అవిశ్రాంతంగా శ్రమించిన శ్రీనివాసరావుని ఎంత అభినందించినా సరిపోదు. ఈ బృహత్తర గ్రంథం తెలుగు సినిమా చరిత్రలో తనకంటూ ఒక స్థానాన్ని పదిలపరచుకుంటుందని ఘంటాపథంగా చెప్పొచ్చు. రచయిత చిన్నారాయణ, ప్రణాళికా నిర్వాహకుడు శ్రీనివాసరావు ఎంతైనా అభినందనీయులు.

**Published by:**

**Srinivas Chimata**
**34361 Eucalyptus Terrace**
**Fremont, CA – 94555 USA**
**Chimata.Music@gmail.com**

* **




**చలనచిత్ర రంగంలో** విలక్షణ, విశిష్ట దర్శకుడిగా పేరొందిన శ్రీ సింగీతం శ్రీనివాస రావుగారు వ్రాసిన కథల పుస్తకం ఇది. సింగీతంగారనగానే పుష్పకవిమానం, మయూరి, ఆదిత్య 369, అపూర్వసహోదరులు.. లాంటి ప్రయోగాత్మక, ప్రయోజనాత్మక చిత్రాలు గుర్తుకు వస్తాయి. ప్రయోగాలంటే ఎంతో ఇష్టపడే సింగీతంగారు ప్రేక్షకాకర్షణని ఎప్పుడూ తక్కువ అంచనా వెయ్యలేదు. ఈ రెండింటినీ సమతూకంలో నడిపి, తన పేరు మీద పదికాలాలు నిలిచిపోయే చిత్రాలని రూపొందించారు. ఈ కథల సంపుటి విషయంలోనూ సరిగ్గా అదే ఫార్ములాని పాటించారు. కథా రచనలో ఇదొక సరికొత్త ప్రయోగం. చాలాసార్లు హాస్య కథలంటే  నవ్వించడానికే పరిమితమౌతాయి. అలానే - వ్యంగ్యం వైపు వెళితే ఆరోగ్యకరంగా నవ్వించడమనేది కత్తిమీద సాము. ఈ పరిమితులని అవలీలగా అధిగమిస్తూ- వ్యంగ్యం,హాస్యం,ప్రయోజనం.. మూడింటినీ అత్యంత ప్రతిభావంతంగా ప్రతి కథలోనూ నింపారు సింగీతంగారు. ప్రతి కథకీ ఒక ప్రయోజనం ఉంది. ఐతే చిట్టచివరి పేరా వచ్చే వరకూ కేవలం నవ్వించడానికే వ్రాసినట్లుంటుంది. ముగింపులో ఒక చక్కటి జీవన సత్యాన్ని చెప్పి, మళ్ళీ చదివించేలా, ఆలోచించేలా చేస్తారు. అనగనగా ఒక రాజ్యం..దాని రాజుగారు 'క రాజు'. ఆయనకో మంత్రీ.- ఇదీ కాన్వాసు.. దీని మీద ఎన్నో కడుపుబ్బ నవ్వించే సన్నివేశాలని,సందర్భాలని, పాత్రలనీ అలవోకగా చిత్రించి ఆ రాజ్యం, ఆ రాజుగారు, ఆ మంత్రిగారూ మన చుట్టూనే ఉన్న అనుభూతిని కలిగిస్తారు. 'జీవితంలో ప్రతిభ ఉన్నంత మాత్రాన సరిపోదు..నిచ్చెన ఎక్కగలిగుండాలి', 'ఒక వ్యక్తి ఇలాంటి వాడని ప్రజలు నిర్ణయించేది అతని స్వభావం వల్ల కాదు. అతను వేసే వేషం వల్ల', 'నైపుణ్యం లేనప్పుడు ఒకే నృత్యకారుడు నాట్యం చేస్తుంటే ఎవ్వరూ చూడరు, కాని అలాంటివారు వందమంది చేరి నాట్యం చేస్తుంటే దాన్ని ప్రజలు ఎంతగానో మెచ్చుకుంటారు','ఏ రాజ్యంలోనైనా మనవాడు కదా ని ఎవర్నైనా సలహాదారుడిగా చేస్తే ఆ రాజ్యం గతిమొత్తం తారు మారౌతుంది..'- లాంటి వాక్యాలు చదువుతుంటే చాలా సీరియస్ నీతి సూక్తుల్లా అనిపిస్తాయి కదా. ఐతే  ఈ పుస్తకం లోని కథా గమనంలో మాత్రం ..ప్రతి వాక్యానికీ నవ్వుకుంటారు,ఆ నవ్వుల్లో మీకు తెలీకుండానే గుర్తుంచుకోదగ్గ సమకాలీన సమన్వయం కనిపిస్తుంది. ఇందులోని కథలని ఒక్కసారి చదివి వదిలెయ్యలేము. మళ్ళీ మళ్ళీ చదవాలనిపిస్తాయి..చదివింది పదిమందితో పంచుకోవాలనే భావం కలిగిస్తాయి. సింగీతం శ్రీనివాసరావుగారు తీసిన విజయవంతమైన చిత్రాల స్థాయిలో నిలబడగలిగే కథలివన్నీ. అందుకే ఇప్పటికే మూడుసార్లు పునర్ముద్రణలు పొందింది ఈ పుస్తకం. ఈ పుస్తకం యొక్క ఆత్మ గురించి ముందుమాటలో గొల్లపూడి మారుతిరావుగారు ఇలా చెప్పారు " కేవలం నవ్వించే హాస్యం - వెకిలిగానూ, కొండొకచో వెగటుగానూ ఉండవచ్చు. కాని సమాజశీలాన్ని చిన్నగాటుతో ఉలిక్కి పడేటట్టు చేయడం - ఆరోగ్యకరమైన ఉత్తమ హాస్యం లక్షణం". ఇందుకు ఈ పుస్తకంలోని ప్రతికథా నిలువెత్తు నిదర్శనమే..!

* **

**For copies in India:**
**Visalandhra Publishing House**
**Vijnan Bhavan, 4-1-435 Bank St**
**Hyderabad – 500 001**
**2474 4580 / 2473 5905**
**For copies in US : editor@koumudi.net**
***OR***
kiranprabha@gmail.com




**వర్తమాన రచయితల్లో** తనకంటూ ఒక ఒరవడి సృష్టించుకున్న రచయిత శ్రీ కస్తూరి మురళీకృష్ణ. వివిధ సాహితీ ప్రక్రియల్లో తన ప్రతిభని చాటుకుంటున్నారు. కథలూ, నవలలూ, చారిత్రాత్మక నవలలు, సైంటిఫిక్ కథలూ, వర్తమాన రాజకీయ విశ్లేషణలూ.. అన్నింటిలోనూ తన ప్రత్యేకతని నిరూపించుకుంటున్నారు. ఆయన వ్రాసిన తాజా చారిత్రాత్మక నవల శ్రీకృష్ణదేవరాయలు. విజయనగర సామ్రాజ్య పట్టాభిషిక్తుడవడం వద్దనుంచీ, దక్షిణభారత జైత్రయాత్రకి దారితీసిన పరిస్థితులు, అందుకు శ్రీకృష్ణదేవరాయలు సన్నాహాలు చేసిన వైనం, జైత్రయాత్రను విజయవంతం చేయడం వెనుక ఆయన పాటించిన యుద్ధ తంత్రాలు, రాయలవారి కళాసాహిత్యాభిలాష, యుద్ధవాతావరణంలో కూడా తన కళాభిరుచిని కొనసాగించిన తీరు ...అన్నింటినీ ఎంతో ఆసక్తికరంగా వ్రాశారు. మురళీకృష్ణగారు సన్నివేశాలని వర్ణించిన విధానం ఆయా దృశ్యాలని కళ్ళకి కట్టినట్లు చూపిస్తుంది. సరళమైన రచనా శైలి కూడా రచయితకి పెద్ద ఎస్సెట్. కేవలం సంఘటనలని యధాతధంగా వ్రాస్తే వ్యాసం అయ్యే ప్రమాదం ఉంది. అలా కాకుండా అవసరమైన చోట అవసరమైనంత నాటకీయతని చొప్పించి ఈ పుస్తకానికి పాపులర్ నవలకుండేటంత రీడబిలిటీని తీసుకొచ్చారు. "నేను దేన్నయినా క్షమిస్తాను కానీ ఓటమి ప్రసక్తి రావటాన్ని క్షమించను. ఓటమి అన్న ఆలోచన లీలామాత్రంగా వచ్చినా అది వ్యక్తిని బలహీనుడిని చేస్తుంది..","గాడిద నాయకత్వం వహిస్తే సింహాల సైన్యం కూడా పరాజయం పాలవుతుంది. అదే సింహం నాయకత్వంలో గాడిదల సైన్యం కూడా విజయం సాధిస్తుంది...","మన మనసులో ఎలాంటి ఉద్దేశ్యాలు ఉన్నా లౌకికంగా మనపై ఉన్న బాధ్యతలను నిజాయితీగా, చిత్తశుద్ధిగా నిర్వహించాల్సి ఉంటుంది.." లాంటి వ్యాఖ్యానాలతో ఆయా పాత్రల వ్యక్తిత్వాలని, సన్నివేశాల వెనుకనున్న ఆంతర్యాన్ని చక్కగా చిత్రీకరించారు. కొన్ని కొన్ని కీలక సన్నివేశాలని (రాయలవారి కుమారుడి మరణం, అప్పాజీ రాజకీయ చతురతని ప్రతిబింబించే సంఘటనలు..) మరింత వివరంగా వ్రాసిఉంటే బావుండేదనిపిస్తుంది. ఐతే ఇంత చిన్న పుస్తకంలో అన్నింటినీ సవివరంగా వ్రాయడం సాధ్యపడదు కనుక పాఠకులు అర్థం చేసుకోగలరు. మొత్తానికి ఈ పుస్తకం చదవడం పూర్తయేసరికి ఒక అద్భుత ప్రపంచంలో నుంచి బయటికి వచ్చిన అనుభూతి కలుగుతుంది. రచయిత మురళీకృష్ణ అభినందనీయులు. చరిత్రమీద ఆసక్తి ఉన్నవారికే కాక సాధారణ పాఠకులకి మామూలు నవలగా కూడా చదవడానికి ఇదొక మంచిపుస్తకం.

* **

***Sole Distribution:***

**Navodaya Book House**
**Opp.Arya Samaj Mandir**
**Kachiguda X Roads**
**Hyderabad – 500 027**
***Also at www.kinige.com***

ఈ శీర్షికలో తమ పుస్తక పరిచయాలు ప్రచురింపబడాలనుకునే వారు, తమ పుస్తకాలు ఒక్కొక్క కాపీని క్రింది ఎడ్రసుకి మెయిల్ చెయ్యవలసిందిగా 'కౌముది' విజ్ఞప్తి చేస్తోంది.

**Editor,**
**KOUMUDI(Web Monthly)**
**4251 - Escudo Ct**
**Dublin - CA 94568,USA**

# వొచ్చేసిందొచ్చేసిందోచ్..!!



మీ 'కౌముది' లో రెండేళ్ళ పాటు మిమ్మల్నందరినీ కడుపుబ్బ నవ్వించిన హాస్యగల్పికల సంపుటి అందమైన పుస్తకరూపంలో వెలువడింది.

ప్రతులకోసం రచయితని సంప్రదించండి..!

phanidokka@yahoo.com